ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కుమరం భీం జిల్లా వార్తలు

8

శనివారం 5 అక్టోబరు 2024

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



పరామర్శిస్తున్న మాజీఎమ్మెల్యే కోనప్ప

బెజ్జూరు, అక్టోబరు 4: బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మాజీఎమ్మెల్యే కోనేరుకోనప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని రెబ్బెన గ్రామానికి చెందిన కార్యకర్త పాషాతల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

డిజిటల్‌కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



బతుకమ్మ ఆడే స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్, అక్టోబరు 4: ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్‌కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా తెలిపారు. శుక్రవారం ఓల్డుకాలనీలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్యామిలీ డిజిటల్‌కార్డు సర్వే పక్కాగా చేపట్టాలన్నారు. సూచించిన ప్రొఫార్మాలో పొందుపరిచిన నివేదికను అందించాలన్నారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్, కమిషనర్ అంజయ్య సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలి

బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలని సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లాఅన్నారు. శుక్రవారం మండలంలోని కోయవాగు, చింతగూడలో బతుకమ్మ నిమజ్జనప్రాంతాల్ని పరిశీలించారు. అనంతరం ఎస్పీఎం క్రీడామైదానంలో బతుకమ్మ ఆడేస్థలాన్ని ఎమ్మెల్యే హరీష్‌బాబుతో కలిసి పరిశీలించారు. అనంతరం దసరా వేడుక నిర్వహించే సభాస్థలిని పరిశీలించారు.

పేకాటస్థావరంపై దాడి

పెంచికలపేట, అక్టోబరు 4: మండలకేంద్రంలో శుక్రవారం పేకాట ఆడుతున్న అయిదుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు సీఐ రమేష్ తెలిపారు. తమకు అందినసమాచారం మేరకు పేకాటస్థావరంపై దాడి చేశామన్నారు. ఈదాడిలో అయిదుగురు వ్యక్తులను పట్టుకుని వారినుంచి రూ.9,140 నగదు, రెండు ద్విచక్రవాహనాలు, నాలుగుసెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

రెబ్బెన, అక్టోబరు 4: పెండింగ్ వేతనాలు చెల్లించాలని శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రెబ్బెన ఫారెస్టు నర్సరీ కార్మికులు డీఎఫ్‌వో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి బోగేటిపేందర్ మాట్లాడుతూ వేతనాలు చెల్లించనిపక్షంలో డీఎఫ్‌వోకార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

మున్సిపల్ ఆదాయం పెంపునకు కసరత్తు

- 1460 ఇండ్ల ఆస్తిపన్ను రివైజ్
- కూలిన ఇండ్లకు పన్ను సవరింపు
- భువన్ సర్వేతో ఆస్తిపన్ను లెక్కలు
- క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న అధికారులు



కాగజ్‌నగర్, అక్టోబరు 4: కాగజ్‌నగర్ మున్సిపల్ ఆదాయం పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 14,500ఇండ్లకు ఆస్తిపన్ను రూ.3.75కోట్లు వసూలు చేయాల్సి ఉంది. 2016, 2020సంవత్సరాల్లో భువన్ సర్వే చేశారు. ఈ సర్వేలో పాల్గొన్న సిబ్బంది ఇంటి ఫొటోలు, ఇంటి యాజమాని వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఆస్తి పన్నుల్లో ప్రస్తుతం ఇంటికి తేడాలు రావటాన్ని అధికారులు గుర్తించారు. ఇందులో 1460ఇండ్లు రెండంతస్తుల భవనాలుండగా, వీటికి కేవలం కింద భవనానికి మాత్రమే ఆస్తిపన్ను చెల్లిస్తున్నారు. వీటిని సవరించి ఆస్తిపన్ను రివైజ్ చేసేందుకు మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టరు లింగయ్య, రవీందర్ సవరించాల్సిన ఆస్తిపన్ను బిల్లులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. రెండంతస్తుల భవనాలకు ఆస్తి పన్ను ఎంతమేర వస్తోంది? ప్రస్తుతం కడుతున్న ఆస్తిపన్ను ఎంత అని విచారించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తున్నారు. ఈ నివేదికల ఆధారంగా ఇప్పుడు ఆస్తిపన్ను రెండింతలు కానుంది. అలాగే కొన్నిసంవత్సరాలుగా ఆస్తిపన్నులో పేరు ఉన్న యాజమానులు ప్రస్తుతం లేకపోవటంతో వాటిని తొలగించనున్నారు. ఇలా 1000మంది ఆస్తిపన్ను దారులున్నట్టు అధికారులు గుర్తించారు. వీరికి బిల్లింగ్ సరిచేసి ఏటా ఆస్తి పన్ను కట్టేట్టు సూచిస్తున్నారు. వీటితోపాటు ఒకే ఇంటికి డబుల్ ఆస్తి పన్నుల బిల్లులు వస్తుండటంతో సవరించాలని పలువురు లబ్ధిదారులు నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. వీటిని కూడా పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు నివేదికలను సిద్ధం చేస్తున్నారు. ఆస్తిపన్ను రివైజ్ చేస్తుండటంతో మున్సిపల్ కార్యాలయానికి మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంది. దాదాపు రూ.10నుంచి రూ.20లక్షల మేర ఆస్తిపన్ను పెరిగే అవకాశాలున్నట్టు అధికారులు పేర్కొంటు న్నారు. పట్టణంలోని 30వార్డుల్లోని డబుల్ అంతస్తు భవనాలకు సంబంధించిన ఆస్తిపన్ను రివైజ్ చేసేందుకు అధికారులు ప్రయ త్నాలు చేస్తున్నారు.



కాగజ్‌నగర్‌లో ఆస్తి పన్నును రివైజ్ చేస్తున్న అధికారులు

వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నాం..

-అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్



ఆస్తి పన్నును ఆన్‌లైన్ చేసేందుకు 2016, 2020లో భువన్ సర్వే చేశాం. ఈ సర్వేలో ప్రధానంగా ఆస్తిపన్ను వసూలుకు ఇంటి యాజమాని వివరాలు, ఇంటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. పూర్తి వివరాలు పురపాలక సైట్‌లో పొందుపర్చారు. ఆస్తిపన్నులో తేడాలు వచ్చిన 1460ఇండ్లు ఉన్నాయి. ఇవి రెండు అంతస్తుల్లో ఉండగా, ఒక అంతస్తుకు మాత్రమే ఆస్తిపన్ను కడుతున్నారు. వీటిని రివైజ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఖాళీ బిందెలతో కాలనీవాసుల నిరసన



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

దహెగాం, అక్టోబరు 4: మండలంలోని బీబ్రా గ్రామంలో నీళ్లురావడం లేదని ఆరోపిస్తూ ఎస్సీ కాలనీవాసులు శుక్రవారం ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీరు రావడం లేదని కార్యదర్శి, ఎంపీడీవోకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తమసమస్య పరిష్కరించనట్లయితే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో యువకులు శ్రీకాంత్, గణపతి, ప్రకాష్, సావిత్రి, తిరుపతమ్మ, విజయ, జమున, సేవంత తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని పూజలు



లక్ష్మీదేవరను ఊరేగిస్తున్న గ్రామస్థులు

పెంచికలపేట, అక్టోబరు 4: కొన్నిరోజులుగా వర్షాలులేక వరి,మిరప,పత్తిపంటలు ఎండిపోతున్నాయి. ఈనేపథ్యంలో బొంబాయిగూడ, మొట్లగూడ, ఎర్రగుంటగ్రామాల్లో రైతులు లక్ష్మీదేవరను ఊరేగించారు. వరుణుడు కరుణించాలని కోరుతూ మహిళలు గ్రామదేవతలకు జలాభిషేకం చేసి ప్రత్యేకపూజలు చేశారు.

ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధం కావాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, అక్టోబరు 4: వానాకాలం వరిధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఏఎస్పీ ప్రభాకర్ రావుతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, ఐకేపీ, కార్మిక, రవాణా, బ్యాంకు అధికారులు, రైస్‌మిల్లర్లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలు, టార్పాలిన్ కవర్లు, గన్నిసంచులు, హెక్‌రిమూవర్, డిజిటల్ మైక్రోమీటర్లు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, నీడ ఇతరసదుపాయాలు కల్పించాలని తెలిపారు. జిల్లాలో 34కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అవసరం మేరకు అదనపుకేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ.500బోనస్ ప్రకటించినందున సన్నరకం, దొడ్డురకం వడ్లు వేర్వేరుగా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి సన్నరకం వడ్లు రాకుండా సరిహద్దు మండలాల్లో తనిఖీకేంద్రాలు ఏర్పాటుచేయాలని తెలిపారు. కొనుగోలు అనంతరం జిల్లాలో ట్యాగింగ్ చేయబడిన రైస్‌మిల్లులకు సామర్థ్యం మేరకు కేటాయించిన ప్రకారం ధాన్యం తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఐకేపీ, ప్యాక్స్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు పర్యవేక్షించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధరలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటుచేయాలని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను తప్పసరిగా రైతులకు చెల్లించాలని తెలిపారు. కొనుగోలుకేంద్రాలకు తీసుకురావాల్సిన ధాన్యం నాణ్యతపై పాటించాల్సిన నిబంధనలను గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

కుమరం భీం వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి..

జిల్లాలోని జోడేఘాట్‌లో ఈనెల 17న జరగనున్న కుమరం భీం వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆదివాసీ, గిరిజనసంఘాల నాయకులతో కలిసి భీంవర్ధంతి వేడుకలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలు, ఆహ్వానపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు సమన్వయంతో వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ, గిరిజనసంఘాల నాయకులు వర్ధం తి వేడుకల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈవీఎంల రక్షణకు పటిష్టమైన ఏర్పాట్లు..

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రక్షణకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం అదనపు కలెక్టర్(రెవెన్యూ) దాసరి వేణుతో కలిసి గుర్తింపుపొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్‌ఎన్నికల్లో సాంకేతిక సమస్యలతో ఆగిపోయిన 1బ్యాలెట్‌యూనిట్, 10 వీవీప్యాట్‌లను మరమ్మతుల కోసం ఈసీఎల్ హైదరాబాద్‌కు పంపించామన్నారు. ఈవీఎం గోదాంలలో పూర్తిస్థాయిలో రక్షణచర్యలు చేపట్టి బందోబస్తు కల్పిస్తున్నామని తెలిపారు. సీసీకెమెరాల పర్యవేక్షణలో నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు.

డిజిటల్‌కార్డు సర్వేను వేగవంతం చేయాలి..

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్‌కార్డు సర్వేను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 3వవార్డు దస్నాపూర్‌లో నిర్వహించిన ఫ్యామిలీ డిజిటల్‌కార్డు సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతికుటుంబానికి సంబంధించిన కుటుంబసభ్యుల వివరాలు ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలన్నారు. ఇంటి యజమానురాలిగా మహిళ పేరు నమోదు చేసి తరువాత కుటుంబసభ్యుల పేర్లు నమోదు చేయాలని తెలిపారు. మరణించిన, శాశ్వతంగా ఊరి విడిచివెళ్లిన వారిపేర్లను తొలగించాలని తెలిపారు. ఈనెల 9న వివరాలను పరిశీలించి నిర్ణీత ప్రొఫార్మాలో పొందు పరిచి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఒక కుటుంబానికి ఒక కార్డు ఉంటుందని, కుటుంబంలోని ప్రతి సభ్యుడికి ఒక ప్రత్యేకనంబరు కేటాయిస్తామన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమపథకాలు అన్నింటికీ ఒకే కార్డు అనుసంధానమై ఉంటుందని తెలిపారు. కార్డు వివిధ సంక్షేమ పథకాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, ఎంపీడీవో శ్రీనివాస్, సర్వేబృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



ఆసుపత్రిని సందర్శిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 4: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అదనపుకలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్‌లు, రికార్డులు, ఆసుపత్రి పరిసరాలు, భోజనశాల, వంటగది పరిశీలించి ప్రజలకు అందిస్తున్న వైద్యసేవల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అనారోగ్యం సమస్యలతో వచ్చే ప్రజలపట్ల స్నేహపూర్వకంగా మెదులుతూ మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. చికిత్సలకు అవసరమైన మందుల నిలువలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ఏళ్లవేళలా అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని తెలిపారు. రోగులకు అందించే భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేయనున్న మహిళాశక్తి క్యాంటీన్‌ను సందర్శించారు.

పండుగకు పస్తులుండాల్సిందేనా..?: జీపీ కార్మికుల ఆవేదన



జీపీ కార్యాలయం ఎదుట బైఠాయించిన కార్మికులు

సిర్పూర్(టి), అక్టోబరు 4: దసరా పండుగకు పస్తు లుండాల్సిందేనా అని గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు శుక్రవారం పనులు నిలిపివేసి జీపీకార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమకు 10నెలలుగా వేతనాలు రావడం లేదన్నారు. పండుగ చేసుకోవడం కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. వేతనాలు ఇచ్చేవరకు బైఠాయిస్తామని తెలిపారు. ఈ విషయంపై ఈవో తిరుపతి మాట్లాడుతూ పారిశుధ్యకార్మికులకు రావా ల్సిన పదినెలల వేతనాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు.

వాలీబాల్ కిట్, క్రీడాదుస్తులు అందజేత

కౌటాల, అక్టోబరు 4: మండలంలోని వీర్దండి గ్రామంలో శివరామసాయి యూత్‌వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు గుర్లె శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్రీడా కారులు, యువకులకు వాలీబాల్, క్రీడాదుస్తులు పంపిణీచేశారు.

కార్యక్రమంలో మాజీసర్పంచ్ రేణుక, నాయకులు వంశీ, రాజు, నాగరాజు, యూత్ సభ్యులు విజయ్,విలాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

'త్వరలో పెన్షన్ అందించేందుకు చర్యలు'

శ్రీరాంపూర్, అక్టోబరు 4: రిటైర్డ్ కార్మికులకు త్వరలో పెన్షన్ అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు సింగరేణి విశ్రాంత ఉద్యోగులసంక్షేమ సంఘం ఉపప్రధానకార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెలపింఛన్ 4రోజులు గడిచినా బ్యాంక్‌ఖాతాల్లో పడలేదన్నారు. యూనియన్ బ్యాంకులో సాంకేతిక సమస్యతో పదివేలమంది పెన్షన్‌దారులకు పింఛన్ అందలేదన్నారు. త్వరలో అందరికీపెన్షన్ అందించేందుకు కృషిచేస్తామని బ్యాంకు అధికారులు హామీ ఇచ్చారన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

రెబ్బెన, అక్టోబరు 4: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బెల్లంపల్లి జీఎం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఏరియా అధికారులతో కలిసి గోలేటి సంతలో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరికిరావన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచికార్యదర్శి ఎస్ తిరుపతి, ఎస్‌వోటూ జీఎం కెరాజమల్లు, పీవో ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టు కార్మికుల శ్రమ దోపిడీకి గురవుతున్నారు'

మందమర్రిటౌన్, అక్టోబరు 4: కాంట్రాక్టుకార్మికుల శ్రమదోపిడీకి గురవుతున్నారని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల హక్కుల సాధన కోసం తాము పోరాటాలు చేస్తామన్నారు. సమస్యలుంటే మందమర్రిలో తమ యూనియన్ కార్యాలయానికి వచ్చి సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్, శివ, కృష్ణమోహన్, సందీప్ పాల్గొన్నారు.

ఉద్యోగుల క్షేమం కోరుతూ పూజలు



పూజలో పాల్గొన్న జీఎం దంపతులు

శ్రీరాంపూర్, అక్టోబరు 4: ఉద్యోగుల క్షేమం కోరుతూ శ్రీరాంపూర్ జీఎం బి సంజీవరెడ్డి, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి ప్రత్యేకపూజలు చేశారు. ఎస్ఆర్పీ1,3 గనుల్లో జరిగిన కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు క్షేమంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమంలో గ్రూపు గనుల ఏజెంట్ దంపతులు గోపాల్‌సింగ్, రష్మీసింగ్, ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొమురయ్య, ఎస్ఆర్పీ3 గని మేనేజర్ వెంకట్రావు, రక్షణాధికారులు పాల్గొన్నారు.

'సీఎంపీఎఫ్ కుంభకోణంపై విచారణ చేపట్టాలి'

శ్రీరాంపూర్, అక్టోబరు 4: వెయ్యి కోట్ల రూపాయల సీఎంపీఎఫ్ కుంభకోణంపై సీబీఐ విచారణ చేపట్టాలని కోల్‌మైన్స్ కార్మికసంఘ్(బీఎంఎస్) రాష్ట్రఅధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్‌చేశారు. శ్రీరాంపూర్ ఏరియా యూనియన్‌కార్యాలయంలో పలుగనులకు చెందిన కార్మికులు బీఎంఎస్‌లోచేరగా, వారికి సత్తయ్య యూనియన్ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాగం రాజేందర్, ఐలవేని శ్రీనివాస్‌పాల్గొన్నారు.

'నూతన గనులను ఏర్పాటు చేయాలి'

మందమర్రిటౌన్, అక్టోబరు 4: సంస్థ అభివృద్ధికి నూతనగనులను ఏర్పాటుచేయాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మంద నర్సింహారావు తెలిపారు. శుక్రవారం మందమర్రిలో ఆయన మాట్లాడుతూ వేలంపాటలు లేకుండానే నాలుగు బొగ్గుబ్లాకులను సింగరేణికి కేటాయించాలన్నారు. సమావేశంలో వెంకటస్వామి, అల్లిరాజేందర్ పాల్గొన్నారు.

వాస్తవ లాభాలపై వాటా ఇవ్వాలి: టీబీజీకేఎస్

శ్రీరాంపూర్, అక్టోబరు 4: సింగరేణికి వాస్తవంగా వచ్చిన లాభాలపై కార్మికులకు 33శాతంవాటా ఇవ్వాలని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్‌చేశారు. శ్రీరాంపూర్‌లోని ఆర్‌కే7 గనిపై శుక్రవారం ఆయన మాట్లాడారు. వాస్తవలాభాలపై కాకుండా కొంతనగదును పెట్టుబడి పేరిట పక్కనబెట్టి మిగిలిన దానిపై వాటాఇవ్వడంతో కేవలం 16.9శాతం మాత్రమే అవుతుందన్నారు. ఈవిషయంపై ఆదివారం గోదావరిఖనిలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ సంయుక్తంగా నిర్వహించే ఒక్కరోజు దీక్షను విజయవంతంచేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్రప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, పెట్టెం లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

'కార్మికుల హక్కుల సాధనకు సమ్మెకు పోదాం'

కాసిపేట, అక్టోబరు 4: యాజమాన్యం కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శుక్రవారం కాసిపేట1 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయనపాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లోఉన్న కార్మికుల సమస్యలపై యాజమాన్యం స్పందించకుంటే సమ్మె తప్పదన్నారు. సమావేశంలో బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, తిరుపతి, నాగేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇద్దరి బైండోవర్

భీమారం, అక్టోబరు 4: మండల కేంద్రంలోని సర్వే నెంబరు 138లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా మొరం తవ్వకాలు చేపట్టిన ఎక్స్‌కావేటర్, ట్రాక్టర్ యజమానులు మెండె పున్నం, బొల్లం శ్రీనివాస్‌లను శుక్రవారం తహసీల్దార్ సదానందం ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు. ఒక్కొక్కరిని రూ.5 లక్షల సొంత పూచీకత్తుపై బైండోవర్ చేశామని తెలిపారు.

స్మారక క్రికెట్ పోటీలు ప్రారంభం

కాసిపేట, అక్టోబరు 4 : సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు పెంజర్ల లక్ష్మణ్ స్మారక క్రికెట్ పోటీలు శుక్రవారం కొత్తపల్లి క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. పోటీల్లో 18 జట్లు పాల్గొన్నాయి. అనంతరం క్రీడాకారులు లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాపు, తిరుపతి యాదవ్, రాకేష్, లక్ష్మణ్, ఉమాకాంత్, రాజు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు పాల్పడుతున్న వ్యక్తిని కాపాడిన పోలీసులు

దండేపల్లి, అక్టోబరు 4: గూడెం గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నిస్తున్న వ్యక్తిని బ్లూకోర్టు పోలీసులు శుక్రవారం సాయంత్రం రక్షించారు. కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన నామసాని శ్రీకాంత్ బెల్లంపల్లిలోని బంధువుల ఇంటికివెళ్లాడు. అక్కడ గొడవ జరగడంతో గూడెం గోదావరి నది వద్దకు వచ్చి కుటుంబ సభ్యులకు వీడియోకాల్ చేసి ఆత్మహత్యకు చేసుకుంటానని తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు 100 నంబర్‌కు కాల్ చేశారు. ఎస్సైలు ఉదయ్‌కిరణ్, సతీష్‌లు వెంటనే బ్లూకోర్టు పోలీసు సిబ్బందికి సమాచారం అందించగా వారు శ్రీకాంత్‌ను పట్టుకోని కౌన్సెలింగ్ ఇచ్చి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కుటుంబ సభ్యులను పిలిపించి వారికి అప్పగించారు. సకాలంలో గోదావరి నది వద్దకు చేరుకొని వ్యక్తి ప్రాణాలు కాపాడిన బ్లూకోర్టు పోలీసులు లక్ష్మయ్య, శేఖర్, హోంగార్డులను సీఐ అల్లం నరేందర్, దండేపల్లి, లక్షెట్టిపేట ఎస్సైలు ఉదయ్‌కిరణ్, సతీష్‌లు అభినందించారు.

అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలిపై విచారణ

బెల్లంపల్లిరూరల్, అక్టోబరు 4: బెల్లంపల్లి పట్టణంలోని బూడిదగడ్డ బస్తీ అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు పోటు ప్రమీలపై శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీవో స్వరూపరాణి శుక్రవారం విచారణ చేపట్టారు. ప్రమీల విధులకు సక్రమంగా హాజరు కాకుండా ఆయాతో అంగన్‌వాడీ కేంద్రాన్ని నడిపిస్తుందని విద్యార్థి సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. సీడీపీవో ఇంటింటా తిరిగి బస్తీ వాసులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో కేవలం ఇద్దరు పిల్లలు మాత్రమే ఉన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపడుతామని సీడీపీవో తెలిపారు.

సబ్సిడీపై పెసళ్లు అందజేత

కోటపల్లి, అక్టోబరు 4: కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నుంచి వచ్చిన వంద శాతం సబ్సిడీపై పెసళ్లను శుక్రవారం రాపనపల్లి, అర్జునగుట్ట, మల్లంపేట ఎస్సీ రైతులకు నోడల్ ఆఫీసర్‌లు ప్రసాద్, వెంకట్‌లు అందజేశారు. వారు మాట్లాడుతూ నది పరివాహక ప్రాంతం అయినందున పంటలు మునిగిపోయాయని రైతులు తెలపడంతో పెసళ్లను అందించామని తెలిపారు. రైతువేదిక వద్ద బాంటోస్, టేకు మొక్కలపై అవగాహన కల్పించారు. ఎస్సీ సబ్ ప్లాన్ మండల కో ఆర్డినేటర్‌లు సునీల్, సంపత్, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

కన్నెపల్లి, అక్టోబరు 4 : బీజేపీ మండల అధ్యక్షుడు రామన్న యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. పలువురికి సభ్యత్వం అందజేశారు. నాయకులు వెంకటకృష్ణ, కృష్ణమూర్తి, సంతోష్‌కుమార్, రాజయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువు మత్తడి ధ్వంసం కేసులో ప్రధాన నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

జైపూర్, అక్టోబరు 4: చెన్నూరు పట్టణంలోని శనగకుంట చెరువు మత్తడి ధ్వంసం కేసులో ప్రధాన నిందితులైన చెన్నూరు మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన గిల్డా భర్త రాంలాల్‌గిల్డా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తుల సమ్మయ్యతోపాటు ఎన్నం బానయ్యలను అరెస్టు చేసినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఏసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. చెరువు మత్తడిని గత నెల 16న జిలెటిన్ స్టిక్స్ అమర్చి ధ్వంసం చేశారన్నారు. ఈ కేసులో కౌన్సిలర్ పెండ్యాల స్వర్ణలత భర్త లక్ష్మీనారాయణ, టీమ్ మధుకర్, రాసమల్ల శ్రీనివాస్, దానం నాగయ్యలను అరెస్ట్ చేశామన్నారు. వారిని విచారించగా చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని భూమిని కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు రామ్‌లాల్‌గిల్డా, బత్తుల సమ్మయ్య, మంచాల రాజబాపు, నడిపెల్లి లక్ష్మణ్ రావు, ఉమేష్‌గిల్డా, లక్కం రాజబాపు, పెద్దింటి శ్రీనివాస్, పోగుల శేఖర్, ఇప్ప సంపత్, ఎన్నం బానయ్యలు పట్టణానికి చెందిన గొడిసెల బాపురెడ్డికి విక్రయించారన్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండడంతో ఇరుపార్టీల మధ్య వివాదం ఏర్పడిందన్నారు. చెరువు మత్తడిని ధ్వంసం చేసేందుకు పథకం రచించారన్నారు. రూ.4 లక్షల డీల్ కుదుర్చుకోగా లక్ష్మీనారాయణ, మధుకర్, శ్రీనివాస్‌లకు రూ.2 లక్షలు ఇచ్చారన్నారు. వీరు ఏసీసీ ప్రాంతానికి చెందిన దానం నాగయ్యతో కలిసి మత్తడిని పేల్చివేశారన్నారు. ఇరిగేషన్ ఏఈ ఫిర్యాదు మేరకు కేసు విచారణ జరపగా గత నెల 20న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. కాల్‌డేటా, బ్యాంకు ఖాతా లావాదేవీలపై విచారణ చేపట్టి గురువారం ఏడుగురిని అరెస్టు చేశామన్నారు. ప్రధాన నిందితులైన ముగ్గురిని చెన్నూరు బస్టాండ్ ప్రాంతంలో అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఏసీపీ తెలి పారు. మొత్తం 14 మందిపై కేసులు నమోదు చేసి నట్లు ఆయన వివరించారు. సమావేశంలో చెన్నూరు సీఐ రవీందర్ పాల్గొన్నారు.

అసలు దోషులను తప్పించారని బీఆర్‌ఎస్ నాయకుల రాస్తారోకో



చెన్నూరులో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చెన్నూర్, అక్టోబరు 4: శనగకుంట చెరువు మత్తడి ధ్వంసం కేసులో పోలీసులు అసలు దోషులను తప్పించారని బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. బీఆర్‌ఎస్ నాయకులు డాక్టర్ రాజారమేష్, మున్సిపల్ వైస్‌చైర్మన్ నవాజుద్దీన్‌లు మాట్లాడుతూ మత్తడి ధ్వంసం కేసులో కాంగ్రెస్ నాయకులు గొడిసెల బాపురెడ్డి హస్తం ఉండగా అతన్ని కేసు నుంచి ఎలా తప్పించారని ప్రశ్నించారు. పోలీసులు ఎమ్మెల్యే వివేక్‌కు తలొగ్గి కేసును నీరు గార్చారని పేర్కొన్నారు. పోలీసులు నాయకులను బలవంతంగా స్టేషన్‌కు తరలించారు. తోపులాటలో కౌన్సిలర్ దోమకొండ అనిల్ స్పృహ తప్పి కింద పడడంతో ఆసుపత్రికి తరలించారు. కౌన్సిలర్ రేవెల్లి మహేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మాజీ ఎంపీపీ మంత్రి బాపు, మాజీ సర్పంచు కృష్ణ, నాయకులు శశి, కౌన్సిలర్లు శంకర్ పాల్గొన్నారు.

కేసును తప్పుదోవ పట్టించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

చెరువు మత్తడి ధ్వంసం కేసును తప్పుదోవ పట్టించిన పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకుడు డాక్టర్ రాజారమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి చెన్నూరు క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మత్తడి ధ్వంసం కేసులో కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొడిసెల బాపురెడ్డికి అతని వెనక ఉన్న షాడో ఎమ్మెల్యేకు ప్రధాన హస్తం ఉండగా వారిని ఈ కేసు నుంచి ఎలా తప్పించారని ప్రశ్నించారు.

మత్తడి పేల్చిన ఘటనలో ప్రభుత్వం పక్షపాత వైఖరి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

శనగకుంట చెరువు మత్తడి పేల్చిన సంఘటనలో ప్రభుత్వం పక్షపాత వైఖరి ప్రదర్శించిందని, పోలీసులపై ఒత్తిడి తెచ్చి కాంగ్రెస్ పార్టీ నాయకులను తప్పించారని నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ఆరోపించారు. బీజేపీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు జాడి తిరుపతి, నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలీసు అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులను పక్కన బెట్టి ఇతర పార్టీల నాయకులపై కేసులు నమోదు చేశారన్నారు. ఇప్పటికైనా నిష్పక్షపాతంగా విచారణ జరగడానికి కేసును ఎన్ఐఏకు అప్పగించాలన్నారు. వెంకటనర్సయ్య, శ్రీపాల్, శ్రీనివాస్, శంకర్, రాజు, మధుకర్ పాల్గొన్నారు.

రేపు దుర్గామాత మహాసంకల్ప శోభాయాత్ర

గర్మిళ్ల, అక్టోబరు 4: వనితావాక్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 6న మధ్యాహ్నం 108 కలశాలతో దుర్గామాత మహాసంకల్ప యాత్ర నిర్వహిస్తామని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సైకాలజిస్టు రంగు వేణుకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విశ్వనాథ ఆలయం నుంచి ప్రారంభమై ఐబీ చౌరస్తా వరకు జరుగుతుందన్నారు. సాయంత్రం 5 గంటలకు బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తామన్నారు. జ్యోత్స్నచంద్రదత్, కవిత, సునీత, శ్రీదేవి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతుకు చర్యలు

బెల్లంపల్లి, అక్టోబరు 4: రహదారుల మరమ్మతుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. శుక్రవారం అంబేద్కర్‌నగర్ నుంచి కాసిరెడ్డిపల్లి వరకు రహదారికి మరమ్మతు చేయించామన్నారు. కమిషనర్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డీపీవో పర్యటన

కోటపల్లి, అక్టోబరు 4: పారుపల్లి, ఏదులబంధం, పుల్లగామ, రొయ్యలపల్లి గ్రామాల్లో శుక్రవారం డీపీవో వెంకటేశ్వర్‌రావు పర్యటించారు. రోజు పారిశుధ్య పనులను చేపట్టాలని, ఇంటింటికి చెత్త సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. అనంతరం సెగ్రిగేషన్ షెడ్‌లను పరిశీలించి కంపోస్టు ఎరువులను తయారు చేయాలని సూచించారు. ఎంపీవో సత్యనారాయణరెడ్డి, కార్యదర్శులు తిరుపతి, శ్యామల, సమ్మయ్య,రమేష్, సందీప్ ఉన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

తాండూర్, అక్టోబరు 4: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని డీఆర్‌వో తిరుపతి అన్నారు. శుక్రవారం మాదారం 3 గ్రామంలో అటవీ శాఖ అధికారులు ర్యాలీ నిర్వహించారు. వన్యప్రాణులతోనే పర్యావరణం సమతుల్యంగా ఉంటుందన్నారు. వన్యప్రాణులను హతమారిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎఫ్ఎస్‌వో సువర్ణ, ఎఫ్‌బీవో భాస్కర్,గోపికృష్ణ, మాజీ ఎంపీటీసీ రాంచందర్, మాజీ సర్పంచు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బండి సంజయ్‌ను కలిసిన బీజేపీ నాయకులు

గర్మిళ్ల, అక్టోబరు 4: కరీంనగర్‌లో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఎన్‌హెచ్ 63 బాధిత రైతులతో కలిశారు. ఎన్‌హెచ్ 63 బాధితుల సమస్యలను పరిష్కరించాలని, వారికి న్యాయం జరిగేలా చూడాలని వినతి పత్రం అందించారు.

రోడ్డు ప్రమాదాలను నివారణకు చర్యలు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 4: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో రోడ్డు భవనాలు, పోలీసు, ట్రాఫిక్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రహదారులపై లైట్లు, మూలమలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీలో పరిధిలోని రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలన్నారు. వీధి విక్రయదారులకు ప్రత్యేక స్థలాలను కేటాయించాలన్నారు. జిల్లాలో అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. ఎల్ఆర్ఎస్ 2020పథకంలో లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అందిన దరఖాస్తులనుక్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ప్రభుత్వ భూములు, చెరువు శిఖం, వాగు సంబంధిత భూములను రికార్డులను పరిశీలించాలని, వీటిపరిధిలో ఉంటే దరఖాస్తులను తిరస్కరించాలన్నారు. డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీటీసీఈప సంపత్, అధికారులు పాల్గొన్నారు.

సదస్సు కరపత్రాల విడుదల

గర్మిళ్ల, అక్టోబరు 4 : హైద్రాబాద్ రెడ్‌హిల్స్‌లో ఈ నెల 9న జరిగే తెలంగాణ ప్రజాఫ్రంట్ 15ఆవిర్భావదినోత్సవం కరపత్రాలను శుక్రవారం మంచిర్యాలలోని అమరవీరుల స్థూపం వద్ద విడుదలచేశారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాలు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు జైపాల్‌సింగ్, సమ్మన్న,పోషన్న,చంద్రయ్య, ఆనంద్,సంతోష్ పాల్గొన్నారు.

అలరించిన ఫ్రెషర్స్‌డేలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

లక్షెట్టిపేటరూరల్, అక్టోబరు 4 : పట్టణంలోని శ్రీవైష్ణవి, వాగేశ్వర డిగ్రీ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డేలు అలరించాయి. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు ఆకుల కిరణ్, అప్పని లక్ష్మణ్, తహసీల్దార్ దిలీప్‌కుమార్, డైరెక్టర్‌లు చక్రపాణి, అభినయ్, సుధాకర్, వైస్‌ప్రిన్సిపాల్ తిరుపతి, శ్రీధర్‌రెడ్డి, మహేందర్, సాగర్, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీలో బతుకమ్మ సంబరాలు



ప్రభుత్వ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 4: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మసంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు, అధ్యాపకులు బతుక మ్మను పేర్చి ఆడిపాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..

పెంచికలపేట: మండలతహసీల్దార్‌కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మసంబరాలు నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ టీచరు గౌరుబాయి,ఆయాలు సాలమ్మ, సుశీల పదవీవిరమణ పొందగా వారిని సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, డీటీసరిత, ఆర్ఐ సురేష్, సూపర్‌వైజర్ హసీనా,పద్మ, అంగన్‌వాడీసిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలను తొలగించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో భిక్షపతిగౌడ్

కెరమెరి, అక్టోబరు 4: ఈనెల17న జోడేఘాట్‌లో నిర్వహించే కుమరంభీం వర్ధంతిని పురస్కరించుకుని జోడేఘాట్ నుంచి హట్టి వరకు రోడ్డును చదునుచేసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని డీఎల్‌పీవో భిక్షపతిగౌడ్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన హట్టినుంచి జోడేఘాట్ వరకు ఉన్న రోడ్డును పరిశీలించారు. దసరాలోపు పూర్తిచేయాలని ఏపీవో మల్లయ్యను ఆదేశించారు. ఆయనవెంట ఎంపీడీవో అంజద్‌పాషా, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలి

ఆసిఫాబాద్, అక్టోబరు 4: జిల్లాలో డీఎస్సీ-2024 ఫలితాల్లో మెరిట్ సాధించి 1:3నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులు తమ ధ్రువపత్రాలను పరిశీలించుకోవాలని డీఈవో యాదయ్య ఒకప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు పరిశీలించుకోని అభ్యర్థులు శనివారం సాయంత్రం 5గంటలలోపు జడ్పీఎస్ఎస్ బాలురపాఠశాలలో హాజరై ధ్రువపత్రాలనువెరిఫై చేయించు కోవాల న్నారు.

కొనసాగుతున్న డిజిటల్ సర్వే

కెరమెరి, అక్టోబరు 4: ధనోర గ్రామంలో డిజిటల్ కార్డు సర్వే శుక్రవారం సైతం కొనసాగింది. ఇందులో భాగంగా గ్రామపంచాయతీ పరిధిలోని హ్యాబిటేషన్ గ్రామాలవారీగా ఇంటిసర్వే చేపడుతున్నట్లు ఎంపీడీవో అంజద్‌పాషా పేర్కొన్నారు. ఈమేరకు ఆయన శుక్రవారం సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శులు బొజ్జిరావు,సతీష్‌రావు,అంబారావు,సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

సిర్పూర్(టి), అక్టోబరు 4: మండలకేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయకమిటీ అధ్యక్షుడు కారం హనుమంతు, అర్చకుడు సత్యనారాయణ మాట్లాడుతూ పదిరోజులపాటు ప్రత్యేకపూజలు,అన్నదానం, స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ

రెబ్బెన, అక్టోబరు 4: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు శుక్రవారం గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. తహసీల్దార్ రాంమోహన్‌రావు అమ్మవారికి ఒడిబియ్యాన్ని, నైవేద్యాన్ని అందించారు.


వీధి దీపాలు అమర్చాలి

బెజ్జూరు, అక్టోబరు 4: గ్రామాల్లో వీధిదీపాలు అమర్చాలని ఎంపీడీవో గౌరీశంకర్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దసరా పండుగ నేపథ్యంలో గ్రామాల్లోకార్యదర్శులు వీధిదీపాలు అమర్చాలని సూచించారు. అదేవిధంగా పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆయనవెంట ఏపీవో రజినీకాంత్, తదితరులున్నారు.

జై శ్రీరాం బియ్యం పేరిట మోసం

కాగజ్‌నగర్, అక్టోబరు 4: కాగజ్‌నగర్ వినయ్‌గార్డెన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు జైశ్రీరాం బియ్యం అని చెప్పి దొడ్డు బియ్యం అంటగట్టారు. క్వింటాల్‌నర రూ.6500చొప్పున తక్కువగా ఇస్తున్నామని చెప్పి స్థానిక వ్యాపారికి అమ్మారు. తాము బియ్యం దందా చేస్తామని, తమకు డబ్బులు అత్యవసరంగా ఉన్నాయని మాయమాటలు చెప్పి తమను నిలువెల్లా మోసం చేశారని బాధితులు వాపోయారు. కాగా అమ్మిన వ్యక్తుల దృశ్యాలు సీసీ కెమెరాకు చిక్కాయి.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక జర్నలిస్టు ఆత్మహత్య



సురేష్(ఫైల్)

వాంకిడి, అక్టోబరు 4: మండలంలోని ఖిరిడి గ్రామానికిచెందిన జర్నలిస్టు వడ్లూరి సురేష్(48) ఆర్థిక ఇబ్బందులు తాళలేక గురువారం రాత్రి గడ్డి ముందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వాంకిడి ఎస్సై ప్రశాంత్ తెలిపినవివరాల ప్రకారం... ఓ దిన పత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తున్న సురేష్ కొన్నేళ్లుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఇదేక్రమంలో తన పిల్లలకు కనీస అవసరాలు కూడా తీర్చలేక పోతున్నానని ఆవేదనతో మద్యం మత్తులో గురువారం రాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యంకోసం మంచిర్యాలకు రెఫర్ చేశారు.

మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి భార్య వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
మంచిర్యాల
జిల్లా వార్తలు
శనివారం 5 అక్టోబరు 2024



కలప అక్రమ రవాణా



- ప్రాణహిత నదిలో తెప్పల రూపంలో దాటిస్తున్న స్మగ్లర్లు
- మంచిర్యాల మీదుగా ఇతర జిల్లాలకు తరలింపు
- అధికారుల కళ్లుగప్పి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

మంచిర్యాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత నది మీదుగా టేకు కలప అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. స్మగ్లర్లు కలపను తెప్పలుగా మార్చి నది మీదుగా అక్రమంగా తరలిస్తున్నారు. అధికారుల కళ్లు కప్పి మహారాష్ట్ర నుంచి మంచిర్యాల మీదుగా ఇతర జిల్లాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పొరుగు రాష్ట్రం నుంచి కలప అక్రమ రవాణా తగ్గినట్లు అధికారులు భావిస్తున్నప్పటికీ స్మగ్లర్లు గుట్టుచప్పుడు కాకుండా లక్షల రూపాయల విలువగల కలపను ఎల్లలు దాటిస్తూనే ఉన్నారు.

మహారాష్ట్రలోని పలు గ్రామాలకు ప్రాణహిత ఇవతలి వైపున ఉన్న పలు ఊర్లతో రాకపోకలు, వ్యాపారాలు కొనసాగుతున్నాయి. ఇందులో అక్రమంగా చేసే దందాలే అధికంగా ఉన్నాయి. ప్రాణహిత నది సరిహద్దున ఉన్న మహారాష్ట్ర అటవీ ప్రాంతం నుంచి మంచిర్యాల జిల్లాలోని కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో వివిధ గ్రామాల మీదుగా జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాలకు కలప అక్రమ రవాణా అవుతోంది. ఆయా మండలాల్లోని పలు గ్రామాలు ప్రాణహిత నదీ తీరానికి సరిహద్దున ఉన్నాయి. నదీ అవతలి వైపు ఉన్న మహారాష్ట్రలోని తేకడ, రేగుంట, గర్కపల్లి, మొట్లగూడెం తదితర ప్రాంతాల నుంచి అక్కడి స్మగ్లర్లు టేకు చెట్లను నరికి దుంగలుగా మలుస్తున్నారు. ఈ దుంగలతో తయారు చేసిన తెప్పలను వర్షాకాలంలో ప్రవాహం ఉన్న రోజుల్లో ప్రాణహిత మీదుగా ఇవతలివైపు తరలిస్తున్నారు. వేసవిలో నీరులేని సమయంలో నేరుగా వాటిని నది దాటిస్తున్నారు. అలా ప్రాణహిత దాటి తెలంగాణకు వచ్చిన కలపను స్మగ్లర్లు స్వాధీనం చేసుకొని రహస్య ప్రాంతాల్లో నిలువ చేసుకుని అదునుచూసి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

జాతీయ రహదారి మీదుగా..

మహారాష్ట్రలోని అటవీ ప్రాంతాల నుంచి కలపను ఇవతలి వైపు సులువుగా తరలించేందుకు అక్కడి స్మగ్లర్లకు ప్రాణహిత నది కలిసి వస్తోంది. అక్రమ కలపను పట్టణ ప్రాంతాలకు తరలించేందుకు ఇక్కడి స్మగ్లర్లు 63వ జాతీయ రహదారిని ఎంచుకుంటున్నారు. అక్కడి కలప డిపోల్లో కొంతమేర పర్మిట్ కలపను కొనుగోలు చేస్తున్న స్మగ్లర్లు దానికి అక్రమంగా రవాణా చేసిన కలపను జత చేసి వివిధ వాహనాల ద్వారా అనుమానం రాకుండా సరిహద్దులు దాటిస్తున్నారు. జాతీయ రహదారిపై ఎక్కడ అటవీశాఖ తనిఖీ కేంద్రాలు లేకపోవడం స్మగ్లర్లకు కలిసి వస్తోంది. జూలైలో కోటపల్లి మండలం జనగామ శివారులోకి ప్రాణహిత నదిలో తెప్పలుగా టేకు కలప వస్తుందన్న సమాచారం మేరకు అటవీ అధికారులు నిఘా ఉంచారు. తీరం వెంట గాలింపు చేపట్టగా సుమారు రూ.4 లక్షల విలువైన 20 టేకు దుంగలు లభ్యమయ్యాయి. అలాగే ఆగస్టు 29న కోటపల్లి మండలం వెంచపల్లి సమీపంలోని ప్రాణహిత నది మీదుగా తెలంగాణకు తెప్పల ద్వారా అక్రమంగా తరలిస్తున్న 29 టేకు దుంగలను అటవీ అధికారులు పట్టుకున్నారు. ఆ కలప విలువ రూ.2 లక్షలు ఉన్నట్లు తెలిపారు. గతేడాది అక్టోబరులో కోటపల్లి మండలంలోని లింగన్నపేట వైపు నుంచి చెన్నూరుకు ఓ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను అధికారులు పట్టుకున్నారు. ఇందులో 20 వరకు టేకు దుంగలు ఉండగా రూ.లక్ష విలువైన కలపను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు పట్టుకుంటున్న కలప కొంత మొత్తంలో ఉండగా, వాళ్ల కళ్లు గప్పి స్మగ్లర్లు తరలించేదే పెద్ద మొత్తంలో ఉంటుందనే ప్రచారం ఉంది.

కలప అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

సదానందం, కోటపల్లి రేంజ్ అధికారి

కలప అక్రమ రవాణాను నిరోధించేందుకు ఉన్నతాధికారుల సూచనలతో ఎప్పటికప్పుడు నిఘా ముమ్మరం చేస్తున్నాం. కోటపల్లి మండలం జనగామ మీదుగా కలప అక్రమ రవాణా అవుతోంది. సమాచారం అందగానే ప్రాణహిత నదీ తీరప్రాంతాలతో పాటు పలు మార్గాలలో గస్తీ ఏర్పాటు చేస్తున్నాం. మహారాష్ట్ర అధికారులు కూడా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. కలప అక్రమ రవాణా చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.



కోటపల్లి మండలంలో అధికారులు పట్టుకున్న కలప (ఫైల్)



నేడు కాకా జయంతి

- హైదరాబాద్‌లో వేడుకలకు ఏర్పాట్లు
- హాజరు కానున్న ముఖ్యమంత్రి,మంత్రులు



మందమర్రిటౌన్, అక్టోబరు 4: దివంగత కాంగ్రెస్ పార్టీ కురువృద్ధుడు మాజీ కేంద్ర మంత్రి కాకా జి. వెంకటస్వామి జయంతిని శనివారం ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి, మంత్రులు ట్యాంక్ బండ్ వద్ద గల కాకా వెంకటస్వామి విగ్రహం వద్ద నివాళులర్పించనున్నారు. జయంతికి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, కాకా అభిమానులు పాల్గొననున్నారు. ఏర్పాట్లను ఆయన తనయుడు చెన్నూరు, బెల్లంపల్లి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, వినోద్, మనవడు ఎంపీ గడ్డం వంశీకృష్ణలు పర్యవేక్షిస్తున్నారు. రవీంద్రభారతిలో ఉదయం 11 గంటలకు కాకా జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొననున్నారు. పలు జిల్లాల్లో కూడా కాకా జయంతిని నిర్వహించనున్నారు. అన్నదానం, రక్తదాన శిబిరాలను నిర్వహించనున్నారు. చెన్నూరులో మహా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. కాకా తనయుడు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ విశాఖ చారిటబుల్ ట్రస్టు ద్వారా అనేక సేవ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వానికి తమ కుటుంబం రుణపడి ఉంటుందని తెలిపారు.

నేడు సేవా కార్యక్రమాలు

మందమర్రిటౌన్: కాకా జి.వెంకట స్వామి జయంతి పురస్కరించుకొని శనివారం సేవా కార్యక్రమాలు చేపడతామని కాంగ్రెస్ నాయకులు మంద తిరుమల్‌రెడ్డి, కడారి శ్రీనివాస్, నర్సింగ్‌లు పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ కాకా సేవలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అధికారికంగా కాకా జయంతిని నిర్వహిస్తోందన్నారు. పార్టీతో పాటు నిరుపేదల సంక్షేమానికి కృషి చేసిన గొప్ప నాయకుడన్నారు. కిరణ్, రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి, అక్టోబరు 4: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం వేమనపల్లి మండలానికి చెందిన వంద మందికి పైగా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలతో ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. పార్టీలో చేరిన వారు సీనియర్ నాయకులతో కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడిగా ఎన్నికైన కుంబాల రాజేష్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. మాజీ జెడ్పీటీసీ సంతోష్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జెన్‌కో ఆధ్వర్యంలో పవర్‌ప్లాంట్ నిర్మించాలి



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

మందమర్రిరూరల్, అక్టోబరు 4: రామగుండంలో థర్మల్ పవర్ ప్లాంట్‌ను జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించాలని శుక్రవారం ఊరు మందమర్రిలోని సబ్‌స్టేషన్‌లో ఉద్యోగులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఏడీఈ రాజ్‌కుమార్ మాట్లాడుతూ రామగుండంలో పవర్ ప్లాంట్‌ను డిస్మెంటల్ చేసి దాని స్థానంలో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ నిర్మించాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. సింగరేణి, ప్రభుత్వం కలిసి ప్లాంటు నిర్మించాలని సన్నాహాలు చేస్తుందన్నారు. ఏఈ వేముల మౌనిక, లైన్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో వర్షం

బెల్లంపల్లి, అక్టోబరు 4: పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో భారీ వర్షం పడింది. దాదాపు గంటకు పైగా వర్షం కురవడంతో రహదారులపై నీరు ప్రవహించింది. 16వ వార్డులో భారీ వృక్షం దూడ సురేష్ అనే వ్యక్తి ఇంటిపై పడింది. దీంతో రేకులు, గోడలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

కుటుంబ సభ్యుల వివరాలు సక్రమంగా సేకరించాలి

కలెక్టర్ కుమార్‌దీపక్



అల్లీపూర్‌లో ఫ్యామిలీ డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

దండేపల్లి, అక్టోబరు 4: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డుల జారీకి సంబంధించి ఇంటింటా కుటుంబ సభ్యుల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శుక్రవారం అల్లీపూర్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టులో భాగంగా అల్లీపూర్‌లో ఇంటింటా ఫ్యామిలీ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల వారి నుంచి పూర్తి వివరాలు సేకరించాలన్నారు. ఈ సర్వేను ఈనెల 9 వరకు సేకరించాలన్నారు. సర్వే బృందాలకు అందించిన జాబితా ప్రకారం పేర్లు వివరాలు సరి చేయాలన్నారు. అనంతరం దండేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇచ్చే వైద్యం తీరును పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండి మంచి వైద్యం అందించాలని సూచించారు. గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి రోగులకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కస్తూర్బా విద్యాలయంలో చేపట్టే నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టి దసరా సెలవుల్లోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, మండల పరిషత్, రెవెన్యూశాఖ అధికారులు పాల్గొన్నారు.

సర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్: జిల్లాలో చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టు సర్వే ప్రక్రియను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేసే విధంగా అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపాలిటీలోని 16వ వార్డు అశోక్‌రోడ్డులో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడు తూ సర్వేను సకాలంలో పూర్తి చేసి 9వ తేదీన వివరాలను పరిశీలించి నిర్ణీత ప్రొఫార్మాలో పొందుపర్చి నివేదిక అందించాలన్నారు. ఒక కుటుంబానికి ఒక కార్డు ఉంటుందని, కుటుంబంలోని ప్రతీ సభ్యుడికి ప్రత్యేక నంబరు కేటాయిస్తామన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నింటికి ఒకే కార్డు అనుసంధానమై ఉంటుందన్నారు. మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

సర్వేను సకాలంలో పూర్తి చేయాలి

కాసిపేట: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పనులను సకాలంలో పూర్తి చేయాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ అన్నారు. శుక్రవారం సోమగూడెం(కే) పంచాయతీలో చేపడుతున్న సర్వే పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అందించేందుకు ఫ్యామిలీ డిజిటల్ కార్డు విధానాన్ని అందుబాటులోకి తేస్తుందన్నారు. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద సోమగూడెం(కే) పంచాయతీని ఎంపిక చేసి సర్వే చేపడుతున్నామన్నారు. 179 కుటుంబాలను సర్వే చేశామని తెలిపారు. ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో సప్దర్ అలీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన కోడి కత్తి



బండి మధునయ్య (ఫైల్)

కన్నెపల్లి, అక్టోబరు 4 : కోడి కత్తి ప్రాణం తీసింది... కోడి పందేలు ఆడుతుండగా మణికట్టుకు కత్తి తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మాడవెల్లి గ్రామ పంచాయతీ పరిధి బొత్తపల్లి గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. బొత్తపల్లి శివారులోని చెరువు కట్ట వద్ద కోడి పందేలు జరుగుతు న్నాయి. కోడిపుంజు కాలికి కత్తి కట్టి వదులుతుండగా కన్నెపల్లి మండలం బొత్తపల్లి గ్రామానికి చెందిన బండి మధునయ్య(43) చేతి మణికట్టుకు కత్తి తగలడంతో తీవ్ర గాయమైంది. వెంటనే మధునయ్యను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్సై గంగారాం సంప్రదించగా ఈ విషయంపై ఫిర్యాదు అందలేదన్నారు.

అప్రమత్తతతో వాహనాలు నడపాలి



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

బెల్లంపల్లి, అక్టోబరు 4 : ప్రతీ ఒక్కరు అప్రమత్తతో వాహనాలు నడపాలని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పోలీసు వాహనాలు నడిపే డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ వాహనం నడిపే సమయంలో చిన్న నిర్లక్ష్యం చేసినా కుటుంబాలు రోడ్డు పాలవుతాయని పేర్కొన్నారు. వాహనాల కండీషన్ ఏ విధంగా ఉందో గ్రహించాలన్నారు. . రోడ్డుభద్రత నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, ఏఆర్‌ఏసీపీ సురేందర్‌రావు, వన్‌టౌన్‌సీఐ దేవయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలతో సత్సంబంధాలు మెరుగు పరుచుకోవాలి

కాసిపేట, అక్టోబరు 4 : పోలీసులు ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపర్చుకోవడం వల్లనే నేరాలను నియంత్రించవచ్చని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సీపీ మాట్లాడుతూ పల్లె నిద్ర చేపట్టాలని, దీంతో ప్రజలకు, పోలీసుల మధ్య సంబంధాలు మెరుగుపడడంతోపాటు ప్రజల సమస్యలను తెలుసుకోవచ్చన్నారు. దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆత్మహత్యల నివారణకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ప్రజలకు మత్తు పదార్థాల నిర్మూలనకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం లేడీ కానిస్టేబుళ్ల కొరత ఉందన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. డయల్ 100 ఫిర్యాదుల పట్ల వేగంగా స్పందించాలన్నారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్‌ఏసీపీ రాఘవేందర్‌రావు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమా ర్, జైపూర్ ఎస్ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

గైనకాలజిస్టులతో సమావేశం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 4: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ ప్రైవేటు నర్సింగ్ హోం గైనకాలజిస్టులతో సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లాలోని 23 మంది గైనకాలజిస్టులు పాల్గొన్నారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, సీ సెక్షన్ డేట్‌ను తగ్గించాలని ఆదేశించారు. ఈ నెలలో సాధారణ ప్రసవాలు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేయాలని, వంద శాతం సి సెక్షన్ చేసిన ఆసుపత్రులపై చర్యలు తీసుకొంటామన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. డాక్టర్లు కృపాబాయి, అనిత, సుధాకర్ నాయక్, అనిల్, అరుణశ్రీ, వెంకటేశ్వర్, శ్రీకాంత్‌రావు, పద్మ పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



ఫోన్‌లో సభ్యత్వం చేస్తున్న ఎంపీ నగేష్

జన్నారం, అక్టోబరు 4: పల్లెల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని ఎంపీ నగేష్ పేర్కొన్నారు. శుక్రవారం జన్నారంలో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగిపోయారని పేర్కొన్నారు. అందుకే ప్రజలు పెద్ద ఎత్తున బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ప్రధాని మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీ నేత రాథోడ్ రితీష్, శ్రీనివాస్, మధుసూదన్‌రావు, గోలి చందు, రవి, రవినాయక్, పాల్గొన్నారు.

